ఇద్దరు దొంగలు!

అజీజ్

"మే ఐ కమిన్ సర్?"

"ఎస్, ప్లీజ్!"

స్ప్రింగ్ డోర్స్ కిర్రుమంటూ తెరుచుకున్నాయి.

లోన కడుగు పెట్టిన యువకుడ్ని చూసి "హాలో! రండి, పనిమీద వచ్చారా?" అన్నాను కుర్చీ చూపుతూ.

చెప్పకనే చెబుతోంది అతని వాలకం ఏదో తీవ్రమైన మనఃక్లేశాన్ని అనుభవిస్తున్నాడని.

అతని పేరు సూర్యనాథ్. క్రికెట్ ఆటలో సిద్ధహస్తుడు. పాతికేళ్ళుంటాయి. ఇప్పుడిప్పుడే ఆ క్రీడలో అతనికి గుర్తింపు లభిస్తోంది.

తెల్లగా, పొడుగ్గా, నొక్కుల జుట్టుతో టినోపాల్ బ్రాండు తెల్లదుస్తుల్లో పోతబోసిన క్రికెట్ ఆటగాడిలా ఉంటాడు. అతని అన్న పాంచజన్యతో నాకు పరిచయం వుంది. అతను నగరంలో పేరుమోసిన మనీ లెండింగ్ ఫైనాన్సర్.

ఆ అన్నా తమ్ముళ్ళమధ్య అట్టే పొసగదు. పాంచజన్య తమ్ముడ్ని మెడిసిన్ చదివించి గొప్ప డాక్టర్ని జెయ్యాలని కలలు గనేవాడు. ఐతే, సూర్యనాథ్ క్రికెట్ పిచ్చిలోపడి మెడిసిన్ మూడో సంవత్సరం తప్పి, ఆ ఆటలోనే ఖ్యాతి గడించాలని నిశ్చయించుకున్నాడు.

పాంచజన్య భార్య చనిపోయి నాలుగేళ్ళవుతోంది. ఇప్పుడతనికి నిండా నలభై ఏళ్ళు కూడా వుండవు. భార్య చనిపోయి యిన్నేళ్ళవుతున్నా అతను రెండో పెళ్ళి తలపెట్టకపోవడానికి కారణం, అతనికి స్త్రీ వ్యసనంవుందనీ, ఆ వ్యసనానికి పెళ్ళి ప్రతిబంధకమవుతుందన్న కారణంతో రెండో పెళ్ళి గురించి ఆలోచించలేదనీ పుకార్లున్నాయి. ఆ పుకార్లెంతవరకూ నిజమో నాకు తెలీదు.

"చెప్పండి మిస్టర్ సూర్యనాథ్! ఏమిటి విశేషం? అన్నయ్య ఎలా వున్నారు? పని వత్తిడివల్ల ఈ మధ్య ఆయన్ని చూడటం పడలేదు!" అన్నాను విషయం కదుపుతూ.

సూర్యనాథ్ నావైపు ఆశ్చర్యంగా చూసి, "రాజారెడ్డిగారూ! మీకింకా ఈ సంగతి తెలీదా? ఈ రోజు న్యూస్ పేపర్ చూళ్ళేదా మీరు?" అడిగాడు.

పెదవి విరిచి, "చెప్పానుగా, పని వత్తిడివల్ల పేపర్ తిరగేసేపాటి వ్యవధి కూడా దొరకడం లేదు. పైగా మూడు రోజుల్నించీ మద్రాసులో లేను. ఇన్వెస్టిగేషన్ పనిమీద తిరుచ్చి వెళ్ళి, ఇప్పుడే గంట క్రితం తిరిగొచ్చాను. ఇంతలోనే మీరొచ్చారు. ఇంతకీ ఏం జరిగింది?" అడిగేను కుతూహలంగా.

సూర్యనాథ్ నిట్టూర్చి, చేతిలో వున్న న్యూస్ పేపర్ని నా ముందుకు తోశాడు.

"ప్రత్యేకంగా నేను చెప్పవలసిన అవసరం లేదు. ఫ్రంట్ పేజ్ చూడండి, తెలుస్తుంది!" అన్నాడు.

పేపరందుకుని చూసేను.

హెడ్ లైన్‌లో కనిపించినవార్త నన్ను చకితుడ్ని చేసింది.

"ఐదు లక్షలతో మాయమైన ఫైనాన్సర్!"

మద్రాసు, సెప్టెంబర్ 2: నగరంలో పేరు పొందిన ఫైనాన్సర్ శ్రీ పాంచజన్యగారు నిన్న మధ్యాహ్నం బ్యాంక్ నుండి ఐదు లక్షల నగదు డ్రా చేసుకుని, నల్ల రంగు బ్రీఫ్ కేస్‌లో పెట్టుకుని వెళ్లారట. ఆ తర్వాత ఆయన జాడ తెలియలేదు.

రాత్రి రెండు గంటలయినా పాంచజన్యగారు తిరిగి రాకపోయేసరికి ఆయన తమ్ముడు శ్రీసూర్యనాథ్ కేదో అనుమానం వేసి, ముందు జాగ్రత్త కోసం పోలీసులకు తెలియజేశారు.

పోలీసులు తక్షణం రంగంలోకి దిగి, పాంచజన్యగారి కోసం నగరమంతా గాలించేరు. ఐనా, ఆయన ఆచూకీ తెలియలేదు. పాంచజన్యగారీ విధంగా పెద్ద మొత్తాల్లో డబ్బు తీసికెళ్ళడం ఇదే మొదటిసారి కాదు. ఇదివరకు అనేకసార్లు తీసికెళ్ళారు.

ఆయన చిరమా పెద్ద-పెద్ద కంపెనీలకి ష్యూరిటీ మీద డబ్బు అప్పిస్తూ వుంటారు. ఐతే గతంలో ఆయన వెంట ఎవ్వరో ఒకరు తోడుగా వెళ్ళడం జరిగేది.

ఈసారి ఆయన ఎవ్వర్నీ తోడు తీసుకెళ్ళకుండా, ఒంటరిగా వెళ్ళడం, వెళ్లిన మనిషి ఐపు లేకుండా పోవడంలో ఏదో మర్మం ఇమిడి వుంటుందని స్థానిక పోలీసు

లనుమానిస్తున్నారు. కేసు ఇంకా క్రైంబ్రాంచి కప్పగించడం జరగలేదు.

వార్త సాంతం చదివి—"పోలీసుల అంచనా సరైనదే. తప్పకుండా ఇందులో ఏదో మిస్టరీ వుంది!" అన్నాను పేపర్ బల్లమీద వేస్తూ.

"ఔను! గత పదిహేనేళ్ళుగా అన్నయ్య ఈ వ్యాపారం జేస్తున్నాడు. ఇంతవరకూ ఇటువంటి సంఘటన జరగలేదు. ఈనాడు ఏకంగా ఐదు లక్షలతో అదృశ్యమవ్వడం అత్యంత ఆశ్చర్యకరం!"

"మీరాయన్ని చివరిసారిగా ఎప్పుడు చూశారు?"

"మొన్న మధ్యాహ్నం లంచ్ తీసుకునే సమయంలో. ఇద్దరం కలిసే భోంచేశాం! తరువాత ఆయన కోటుకూడా తొడుక్కోకుండా కుర్చీమీద అలాగే వదిలేసి బ్యాంకు కెళ్ళిపోయారు. అంతే మళ్ళీ తిరిగి రాలేదు!"

"మిస్టర్ సూర్యనాథ్! క్షమించండి యిలా అడుగుతున్నందుకు. మీ అన్నయ్యలోవున్న ఒక బలహీనత గురించి బహుశా మీకు తెలిసే వుంటుందనుకుంటాను."

"ఏ బలహీనత?"

"స్త్రీ!"

సూర్యనాథ్ పలుకలేదు. కాసేపు ఆలోచించి, "తెలుసు!" అన్నాడు.

"స్త్రీ కోసం మగధీరులెందరో చెయ్యకూడని పనులెన్నో చేసినట్టు చరిత్ర పుటలు సాక్ష్యాధారాలు."

"అంటే, మీ ఉద్దేశం."

"ఒక్కోసారి ఎంతటి వాడయినా, స్త్రీ వ్యామోహంలో పడి ఎటువంటి మూల్యాన్నయినా వదులుకోడానికి సిద్ధపడతాడు. మీ అన్నయ్య తనకు తానే

ఎవరో అమ్మాయికో డబ్బు సమర్పించుకుని, గుట్టు చప్పుడు కాకుండా ఆమెతో ఎక్కడో గడుపుతూవుండ వచ్చుగా?"

సూర్యనాథ్ నవ్వి, "ఎంతటి అందగత్తె అయితే మాత్రం ఏకంగా పదులక్షలు సమర్పించుకుంటారా ఎవ్వరయినా? హాస్యాస్పదంగా వుంటుంది." అన్నాడు.

"ఆల్ రైట్! ఈమధ్య ఆయనకోసం యెవరయినా అమ్మాయిగానీ, స్త్రీగానీ, మీ ఇంటికి రావడం జరిగిందా?"

"ఇంటికయితే యెవ్వరూ రారు! కానీ, ఈ మధ్య ఆయనవెంట ఒక యువతి తరచూ కనిపిస్తూన్నట్టు తెలిసింది."

"ఎవరామె?"

"తెలీదు!"

"మీరామెను ఎప్పుడూ చూశ్ళేదా?"

"నో!"

"వాళ్ళిద్దరికి స్నేహం ఏర్పడి ఎన్నాళ్ళయుంటుంది?"

"దాదాపు రెండు నెలలు."

అదే సమయంలో నా అసిస్టెంటు సార్జంట్ దేవిడ్ లోనికివచ్చి, "ఎస్.పి.గారు మిమ్మల్ని పిలుస్తున్నారు సార్" అన్నాడు.

"మిస్టర్ సూర్యనాథ్! ఇక మీరు వెళ్ళి నిశ్చింతగా వుండండి. బహుశా ఎస్. పి. గారు ఈకేసు నా కప్పగించడానికే పిలిపించారనుకుంటాను. నా శక్తివంచన లేకుండా కృషిచేసి, మీ అన్నయ్య ఆచూకీ తెలుసుకో డానికి ప్రయత్నిస్తాను.

మరో విషయం. ఆయన బుద్ధిపూర్వకంగా ఆ డబ్బు తీసుకుని మాయమైవుంటే మాత్రం—అయామ్ సారీ, నేనేం చెయ్యలేను'' అన్నాను లేస్తూ.

సూర్యనాథ్ తలూపి, సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. టేబిల్ మీది క్యాప్ అందుకుని పెట్టుకుంటూ, ఎస్. పి. ఆఫీసులోకి నడిచాను.

నేనూహించింది కరెక్టే.

ఆ కేసు క్రయింబ్రాంచి కప్పగించ బడింది. వెంటనే నన్ను రంగంలోకిదిగి పరిశోధన ప్రారంభించవలసిందిగా పురమాయించాడు ఎస్. పి.

గత మూడురోజాలనుంచి నాకు రెస్టు లేదు. పైగా, నానా అవస్థలూపడి ఇప్పుడే తిరుచ్చినుంచి తిరిగొచ్చేను. ఈ రాత్రి బాగా విశ్రాంతి తీసుకొని, రేపి కేసు లోతు పాతుల చూపి తియ్యాలి. మోటర్ బైక్ యెక్కి యింటికి బయలుదేరాను.

2

ఇంటి గేరేజ్ లో బైక్ ఆపి, తాళం తెరచి, లోన అడుగుపెట్టేను.

ముసక చీకటి.

అప్పటికే సాయంత్రం ఆరుంబావవుతోంది. లైటు వెలిగించి, పడగ్గదిలో కెళ్ళి బట్టలు మార్చుకున్నాను.

అలసటవల్ల ఆకలి కావటంలేదు.

ఆపిల్ జ్యూస్ తాగి పడుకుందామని, బెడ్ రూంలో వున్న ఫ్రిజ్ వైపు నడిచాను. పిడితిప్పి, తలుపు తెరిచాను. అంతే!

వెయ్యి ఓల్టులు కరెంటుషాక్ తగిలినట్టు ఝల్లుమంది. ఒళ్ళు.

ఫ్రిజ్ లోపల శవం!

అందమైన యువతి శవం!!

మోకాళ్ళు మడిచి, నడుంవంచి ఒద్దికగా కూర్చోబెట్టి వుంది.

ఎవ్వరామె? ఎలావచ్చింది? ఎక్కణ్నించి వచ్చింది? ఎవ్వరు చంపారు? చంపినవాళ్ళు శవాన్ని యెక్కడో పారేయకుండా, తాళం వేసున్న నా యింట్లో కెందుకు చేర్చారు?

షాక్ లోంచి తేరుకొని, పరీక్షగా చూశానామెని.

ఎక్కడో చూసినట్టేవుంది మొహం.

ఎక్కడ చూశాను?

రెండు నిమిషాలు జ్ఞాపకశక్తితో యుద్ధంచేసి, విజయం సాధించాను.

ఆమె పేరు సుకన్య.

మాజీ నేరస్థురాలు.

నా పరిశోధనలో పట్టుబడి, కోర్టులో అప్రూవర్ గా విడుదలయింది.

ఆమెను గుర్తుపట్టగానే, గతంలోకి కదిలాయి జ్ఞాపకాలు.

ఆరేళ్ళక్రితం మాంట్ రోడ్డులోవున్న ఓ మార్వాడీ జ్యూవెలరీ షాప్ లో లక్షన్నర విలువచేసే వజ్రాలు దొంగిలించ బడ్డాయి. నేరస్థులకోసం స్థానిక పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యేసరికి ఆకేసు నాకు, అంటే క్రయింబ్రాంచి కప్పగించబడింది.

అష్టకష్టాలూపడి ఎంతో ప్రయాసతో, చివరికి ఆ దొంగ తనానికి కారకులెవరో కనుక్కోగలిగాను. ముగ్గురుకలిసి

చేసిన ప్లాన్డ్ రాబరీ అది. ఆ ప్లాన్‌కు మూలపురుషుడు జగన్.

మరో ఇద్దరు వాడికి సహాయపడ్డారు. ఆ యిద్దరిలో ఈ సుకన్య ఒకర్తి. రెండోవ్యక్తి పేరు నారాయణ. ఐతే, షాప్ తాళాలు పగలగొట్టి దొంగతనం చేసింది మాత్రం జగన్.

నారాయణ కేవలం బయటవుండి, ప్రమాదం ముంచుకొస్తే ఎదుర్కోవడానికి నియమించబడ్డాడు. సుకన్య వజ్రాలను కేసు ముగిసేదాకా జాగ్రత్తగా దాచడానికి తోడ్పడింది.

ఆ దొంగతనం చేసేటప్పుడు యెంతో పకడ్బందీగా జాగ్రత్తలు పాటించాడు జగన్. అందుకే వాళ్ళు పట్టుబడ్డా, సాక్ష్యాలు లేకుండా వాళ్ళమీద కోర్టులో కేసు ఎలా నడిపించాలో అంతుబట్టలేదు నాకు.

అప్పుడు తట్టింది ఒక ఐడియా. నారాయణనీ, సుకన్యనీ నయానా భయానా మచ్చిక చేసుకొని, కోర్టులో వాళ్ళు అప్రూవర్సుగా మారితే శిక్ష పడకుండా తప్పించుకోవచ్చనీ, లేకుంటే జగన్‌తోబాటు అనేక సంవత్సరాలు జైల్లో మగ్గవలసివుంటుందని నూరిపోశాను.

నా పాచిక పారింది. జగన్‌కు విరుద్ధంగా యిద్దరూ ప్రాసిక్యూషన్ సాక్షులుగా మారారు.

దాంతో జగన్ మీద నేరం రుజువయి ఆరేళ్ళ శిక్ష పడింది. శిక్ష విన్నాక బోనుదిగుతూ వాడు సుకన్యా, నారాయణలవైపు చూసిన చూపు నాకిప్పటికీ జ్ఞాపకం వుంది.

ఈహత్య చేసింది వాడేనా? తనతో నేరంచేసి, పట్టుబడ్డాక పోలీసుల పక్షంచేరి తనను జైలుపాలుచేసి, సుల

భంగా తప్పించుకొన్నారన్న కక్షకొద్దీ ఈ కిరాతకానికి ఒడిగట్టాడా?

ఇదే నిజమైతే అటు నారాయణ ప్రాణాలుకూడా ప్రమాదంలో వున్నాయన్నమాట.

వెంటనే ఓ విషయం జ్ఞాపకం వచ్చింది. చటుక్కున గోడమీది కేలండరువేపు చూసేను.

ఇది సెప్టెంబరునెల. జగన్ కు శిక్ష పడింది 1972లో. ఆ లెక్కన వాడు విడుదల కావటానికింకా నాలుగు నెలలు మిగిలున్నాయి. కొంపదీసి జైల్లోంచి పారిపోలేదుకదా? అనుకొంటూ గబగబ ఫోన్ దగ్గరవెళ్ళి, సెంట్రల్ జైలుకు రింగ్ చేశాను.

“జైలర్ నంబియార్ స్పీకింగ్” అవతలనించి వినిపించింది.

“అయామ్ ఇన్ స్పెక్టర్ రాజారెడ్డి ఫ్రం క్రయిం బ్రాంచ్. మీనుండి ఓ ఇన్ఫర్మేషన్ కావాలి. ఆరేళ్ళ క్రితం, అంటే1972లో జగన్ అనే వ్యక్తికి శిక్షపడింది. ఆరేళ్ళు! అతనింకా మీ ప్రిజనర్ గా వున్నాడా, లేక జైల్లోంచి పారిపోయాడా తెలుసుకోవాలి.”

“నో, ఈమధ్య మా జైల్లోంచి ఎవ్వరూ పారిపోలేదు. ఇంతకీ అతను చేసిన నేరం ఏమిటి?”

“రాబరీ, వజ్రాలదొంగతనం.”

“వెయిట్ ప్లీజ్, ఇప్పుడే కనుక్కుంటాను” అవతల నిశ్శబ్దం.

పదినిమిషాలనంతరం నంబియార్ కంఠం విన్పించింది. “ఇన్ స్పెక్టర్, మీరు చెప్పిన ఖైదీ ప్రస్తుతం మా జైల్లో లేదు.”

“పారిపోయాడా?”

"నో. గుడ్ కాండక్టు బేస్ కింద వాడి శిక్ష తగ్గించ బడింది ఆరు నెలలు. సగౌరవంగా విడుదల చెయ్యబడ్డాడు."

"ఎప్పుడు?"

"రెండు నెలల క్రితం."

"థాంక్స్," అంటూ రిసీవర్ క్రెడిల్ చేసి ఆలోచనలో పడిపోయాను.

జగన్ వు నిజంగా వీళ్ళమీద పగతీర్చుకోవాలనే వుంటే విడుదలయిన రెండు నెలల వరకూ యేం చేశాడు? వాళ్ళ ఆచూకీ తెలుసుకోడానికి రెండుమాసాలు పట్టిందా? సుకన్యా నారాయణలవంటి వాళ్లను గురించి తెలుసుకోడానికి ఇంత జాప్యం జరగదే.

మరి ఈ రెండు నెలలూ వాడేం చేశాడు? ఎక్కడ వున్నాడు? తన ప్రత్యర్థిని చంపి, నా ఇంట్లో దేనికి పడేశాడు? ఈ మూడు ప్రశ్నలే నన్ను తికమక పెడుతూ వున్నాయి.

ఆలోచిస్తూ ఫోన్ దగ్గరకి లాక్కుని క్రయిం బ్రాంచికి రింగ్ చేశాను.

"ఎస్, సార్జంట్ స్పీకింగ్" వినిపించింది అవతలనించి.

"నేను రాజా రెడ్డిని. హెడ్ క్వార్టర్స్‌నుండి వెంటనే అంబులెన్సునీ, ఫోటోగ్రాఫర్స్‌ని వెంటబెట్టుకు నా ఇంటికి రా."

"వాట్ హేపెండ్ సర్?"

"వచ్చాక ఇక్కడే అంతా తెలుస్తుంది." అంటూ రిసీవర్ దించి, సిగరెట్ అంటించేను.

పదినిమిషాల్లో అంబులెన్స్ వచ్చి ఆగింది ఇంటిముందు. సార్జంట్ దేవిడ్, ఫోటోగ్రాఫర్స్, పోలీస్ డాక్టరు బిలబిల వచ్చారు లోనికి.

ఫ్రీజ్‌లో నిశ్చింతగా కూర్చున్న శవాన్నిచూసి నిర్ఘాంతపోయారు.

ముందు ఫోటోస్నాప్స్ తీసుకోబడ్డాయి. తరవాత అందరం కలసి శవాన్ని జాగ్రత్తగా ఫ్రీజ్‌లోంచి బయటకి తీశాం.

కాళ్ళూ, చేతులూ బాగా బిర్రబిగుసుకు పోయాయి. ఓ పట్టాన సాగడంలేదు. అతికష్టంమీద సాగదీసి కింద పడుకోబెట్టాం.

అప్పుడు పడింది నాదృష్టి ఆమె ఛాతీమీద.

బ్లౌజుకు గుండుసూదితో గుచ్చబడుంది ఓ మడత బెట్టిన కాగితం.

చటుక్కున దాన్నందుకుని మడత విప్పేను.

అది ఉత్తరం! నా పేర రాయబడ్డ ఉత్తరం!!

చదవసాగేను.

“ఇన్‌స్పెక్టర్!

బహుశా నీవు నన్ను మరచిపోయుంటావు. నీ నేరస్థులకి కోర్టులో శిక్ష పడేవరకే నీకు వాళ్ళ గురించి జ్ఞాపకం వుండేది. తరువాత వారి రూపు రేఖలు నీ మనసులోంచి పూర్తిగా చెదిరిపోతాయి.

నన్ను నీవు మర్చిపోయినా, నేను నిన్ను మర్చిపోలేదు. ఎందుకో తెలుసా? నాతో కలిసి నేరం జేసిన నా ఇద్దరు సహచరుల్ని నీ మాయమాటలతో మచ్చిక జేసుకుని, నాకు విరుద్ధంగా కోర్టులో సాక్ష్యం ఇప్పించావ్. ఫలంగా వాళ్ళని అప్రూవర్స్‌గా విడుదల జేయించావ్!

ఆ ఇద్దరు నీచులు నాకు తీరని నమ్మకద్రోహం జేశారు. పాలు తాగిన రొమ్ముమీదే సమ్మెట దెబ్బలు తీశారు.

అటువంటి నీచుల్ని వరికి ముక్కలు చేసినా పాపం అంటదు.

వాళ్ళెగనక కోర్టులో నోరు మెదపకుండా వుండి వుంటే నా నేరం ఋజువయ్యేది కాదు. శిక్ష పడేదికాదు. జైల్లో వున్నంత కాలం, రాత్రింబవళ్ళూ వాళ్ళ గురించే ఆలోచిస్తూ గడిపేను. శిక్ష తగ్గి త్వరగా విడుదలవాలనే, జైల్లో క్రమశిక్షణతో మెలిగాను.

ఈ రోజు నా ఆశయం నెరవేరుతుంది. సుకన్య శవాన్ని నీ ఇంట్లో ఎందుకు జేర్చానో, బాగా ఆలోచిస్తే నీకే అర్థమవుతుంది. ఆ అర్థమైన విషయం ఆచరణలోకి వచ్చేవరకూ ఎదురు చూస్తూండు.

సెలవ్."

కింద సంతకం లేదు.

ఐనా, అది రాసిందెవ్వరో స్పష్టంగా తెలుస్తూనే వుంది. శవాన్ని పోస్టుమార్టంకు పంపి, సార్జంట్ దేవిడ్‌తో జీప్ ఎక్కి హుటాహుటిన హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకున్నాను.

నేరసుల పాత ఫైలు వెలికి తీసి, అందులో వున్న జగన్ ఫోటోస్టాట్ తీయించి, వెంటనే దాని ప్రింట్లు తయారుచేసి, నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్స్‌కూ పంపమని పురమాయించాను సార్జంట్‌కు.

అంతేకాదు, విమానాశ్రయానికీ, రైల్వేస్టేషన్స్‌కూ, చెక్‌పోస్టులకూ మెసేజ్ పంపి, జగన్ పోలికలు గల వ్యక్తి ఎవ్వరయినా సరే, కస్టడీలోకి తీసుకోవలసిందిగా ఆదేశాలు జారీ చేయించాను.

ఆ తరవాత జగన్ చేసిన వజ్రాల దోపిడీ తాలూకు ఫైలు పరిశీలించాను క్షుణ్ణంగా. ఆ దోపిడీలో జగన్‌కు

సహాయపడ్డ రెండో వ్యక్తి నారాయణ ఇప్పుడెక్కడుంటున్నాడో కనుక్కోవడం అత్యావసరం!

అతని అమాకీ తెలుసుకుని, రక్షణ కల్పించడం నా తక్షణ కర్తవ్యం! లేకుంటే, సుకన్యకు పట్టిన గతే అతనికీ పట్టవచ్చు.

దెబ్బ తిన్న బెబ్బులికీ, పగబట్టిన మనిషికీ అట్టే తేడా వుండదు. ఆ రోజుల్లో నారాయణ ఎక్కడ నివసించేవాడో ఆ ఇంటి చిరునామా దొరికింది ఫైల్లో.

3-1-146, బ్లాక్ నంబర్ 7, పెరంబూర్.

ఆ అడ్రస్ నోట్ చేసుకుని లేచాను.

సార్జంట్ డేవిడ్ జగన్ ఫోటో ప్రింట్లు తీయించడానికి లేబొరేటరీ కెళ్ళాడు. ఒక్కడ్నీ జీప్ ఎక్కి పెరంబూర్ బయలుదేరాను.

3

ఆ ఇంటికొక్క స్త ఇవతల జీప్ ఆపి దిగాను. వీధిలో అట్టే జనసంచారం లేదు. మునిసిపాలిటీ లైట్లు కునికిపాట్లు పడుతున్నట్లు వెలుగుతున్నాయి.

రిస్టువాచీ చూసుకున్నాను. పదిన్నర.

అది మధ్యతరగతి మనుషులు నివసించే వీధి. ఇంటి నంబర్స్ చెక్ చేసుకుంటూ ఐదు నిముషాల తరవాత ఆ ఇంటి ముందు ఆగాను.

తలుపు మూసుంది.

నారాయణ ఇప్పుడూ ఆ ఇంట్లోనే ఉంటున్నాడో, లేక ఇల్లు మారేడో తెలీదు. చుట్టూ కలయ జూసేను. ఎదురింట్లో సన్నగా రేడియో సంగీతం వినిపిస్తోంది. వాళ్ళింకా నిదరబోనట్టున్నారు. వాళ్ళనడిగితే, ఈ ఇంట్లో ఎవరు నివసిస్తున్నారో తెలిసిపోతుంది.

అటు నడిచాను. లోపలినించి మాటలు వినిపిస్తున్నాయి. మెట్లెక్కి తలుపు తట్టాను. రెండు నిముషాల తరవాత తెరుచుకుంది.

"ఎవరండీ?" అడిగాడు ఇంటతను.

ఎదురిల్లు చూపించి, "ఆరేళ్ళ క్రితం ఆ ఇంట్లో నారాయణ అనే వ్యక్తి నివసించేవాడు..."

"ఇప్పుడూ అందులోనే వుంటున్నాడు..." నా మాట పూర్తికాక ముందే జవాబిచ్చాడతను.

"ఏం చేస్తుంటాడు?"

"సిమెంట్ పైపులు తయారుచేసే ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు."

"నైట్ షిఫ్టు కూడా వుంటుందా ఫ్యాక్టరీలో?"

"ఉండదు! పగలే."

"థాంక్స్!" అంటూ వెనుదిరిగి నారాయణ ఇంటి వైపు నడిచాను.

వెనక తలుపు మూసుకున్న చప్పుడు.

ఆ ఇంటి మెట్లెక్కి తలుపు తట్టాను మెల్లిగా.

జవాబు లేదు!

"నారాయణా!" పిల్చాను.

నిశ్శబ్దం!

పడుకున్నాడా? అనుకుంటూ పిడికిలి బిగించి గట్టిగా బాదాను.

అంతే!

కిర్రుమంటూ తెరుచుకుంది.

ఆశ్చర్యపోతూ పూర్తిగా తెరిచేను!

లోపల మసక చీకటి!

"నారాయణా!" పిల్చాను గట్టిగా.

జవాబు శూన్యం.

లోన కదుగు పెట్టాను. ఇంట్లో ఎవ్వరూ వున్నట్లు అలికిడి లేదు. ఆ గది కిరువైపులా రెండు గదులున్నాయి. ముందు కుడివైపు గదిలో కెళ్ళి చూశాను.

ఓ గోడవారగా మంచం, మంచంపైన పరుపు, రెండు దిళ్లు. అంతే! మనిషి ఛాయలేదు. బైటకి వచ్చి, దాని కెదురుగా వున్న రెండో గదిలో కెళ్ళాను.

స్టవ్, గిన్నెలూ, ప్లేట్లూ, రేషన్ డబ్బాలూ కని పించేయి. బహుశా, వంట గదయుంటుంది. దాంట్లోంచే, దొడ్లో కెళ్ళడానికాక్కా బోలు మరో తలుపుంది. దగ్గరగా జేరవేసుంది. జేబులోంచి పాకెట్ టార్చితీసి వెలిగించేను. తలుపు తోసి దొడ్డి వరండాలో అడుగు పెట్టాను.

చిన్నసైజు ఓపెన్ ప్లేస్. చుట్టూ ఎత్తయిన గోడ. దొడ్లోంచి బయటికెళ్ళడానికి మరో తలుపుంది. మనిషి మాత్రుడు లేడక్కడ. ఇంటికి తాళం కూడా వెయ్య కుండా ఎక్కడికి వెళ్ళాడు నారాయణ?

ఆలోచిస్తూ ఆ తలుపు వైపు నడిచి నివ్వెరబోయేను. దానికి లోపలివైపు గడియ వేసిలేదు. తలుపు దగ్గరగా జేరవేసుంది.

నేను తనింటికి వస్తున్నట్టు గమనించి నారాయణ దొడ్డి తలుపుగుండా వెళ్లిపోయాడా? ఎందుకు? తీవ్రంగా ఆలోచిస్తూ ఆ తలుపు బోల్టు బిగించి వెనుదిరిగాను.

చకచక ఆ యింట్లోంచి బయటపడి, సింహద్వారం మూసి ఇవతల గొళ్లెం పెట్టి మెట్లు దిగాను. నారాయణ దొడ్డి తలుపుగుండా ఎందుకు వెళ్లిపోయాడో ఎంతకీ అంతుబట్టడం లేదు. హెడ్ క్వార్టర్స్ కెళ్ళి ఇద్దరు

మఫ్టీ కానిస్టేబుల్స్‌ని పంపాలి, ఈ ఇంటిమీద ఓ కన్నేసి వుంచడానికి.

గబగబ అడుగులు వేస్తూ జీప్‌ని సమీపించి, చటుక్కున ఆగిపోయాను. డ్రైవింగ్ సీట్లో ఎవరో కూర్చున్నట్టు వీపు కనిపిస్తోంది మసక చీకట్లో. ఎవ్వరు?

చెయ్యి అప్రయత్నంగా పాంటు జేబులోకి వెళ్ళింది. వేలితో సేఫ్టీ కాచ్ వెనక్కి లాగుతూ పిస్తోలు బైటికి తీశాను. ఎడంచేతిలో టార్చిలైటు రెడీగా పట్టుకుని, రెండడుగులు ముందుకువేసి, చటుక్కున ఫోకస్ చేశాను డ్రైవింగ్ సీటుమీద.

ఆశ్చర్యంతో నా కళ్ళు పెద్దవయ్యాయి. స్టీరింగ్ మీద ముందుకొరిగి కూర్చున్నాడతను. చేతులు రెండూ ఆకుకూర కాడల్లా వేళాడుతున్నాయి.

అతను ఎవరో కాదు.

నారాయణ!

నిర్జీవమైన నారాయణ!

వీపులో పిడివరకూ దిగివుంది కత్తి. వీపంతా ఎర్రని చిక్కని రక్తం. అతని పళ్ళమధ్య మడత పెట్టిన ఓ కాగిత మిరికించి వుంది. చటుక్కున దాన్ని ఇవతలికి లాగిమడత విప్పేను.

త్వరత్వరగా, గజిబిజిగా రాసివున్నాయి అక్షరాలు.

“ఇన్‌స్పెక్టర్,

కాకతాళీయం అంటే ఇదేకాబోలు. నేను నారాయణ ఇంట్లో ప్రవేశించి, కత్తితో వాణ్ణి కైలాసం పంపడం, అదే క్షణంలో నీవు తలుపు తట్టడం ఒకేసారి జరిగాయి. వెంటనే వాడి శవాన్ని భుజాన వేసుకొని

దొడ్డితలుపుగుండా బయట పడ్డాను. ఈసారి నన్ను పట్టుకోవటం నీతరం కాదు. గుర్తుంచుకో."

పళ్లు పటపట కొరుకుతూ ఉత్తరాన్ని జేబులోకి తోశాను.

నారాయణ శవాన్ని సీట్లో ఒరగబెట్టి, స్టీరింగ్ ముందు కూర్చున్నాను. జీప్ స్టార్ట్ చేసి శరవేగంతో పోనిచ్చాను హెడ్ క్వార్టర్స్ వేపు.

4

జగన్ కోసం నగర పోలీసులంతా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ఇప్పుడు వాడి విషయంకన్న, ఐదు లక్షలతో మాయమైన పాంచజన్య వ్యవహారం తేల్చడం ముఖ్యం.

ఉదయం లేవగానే కాలకృత్యాలు తీర్చుకొని, ఇంటినించి తిన్నగా పాంచజన్య ఇల్లుచేరుకుని అతని తమ్ముడు సూర్యనాధ్ ను కలుసుకున్నాను.

"మీ అన్నయ్య అదృశ్యమైన రోజు చివరిసారి మీరు ఆయన్ని చూసినప్పుడు, అంటే ఆరోజు మధ్యాహ్నం మీరిద్దరూ డైనింగ్ హాల్లో భోజనంచేశాక, ఆయన తిరిగి కోటు తొడుక్కోకుండా కుర్చీమీద అలాగే వదిలేసి వెళ్లారన్నారు కదూ? ఒకసారి ఆ కోటు చూపిస్తారా?" అడిగాను.

సూర్యనాధ్ తలూపి, తనవెంట రమ్మన్నట్టు సైగ చేశాడు. ఇద్దరం మెట్లగుండా మేడమీదికెళ్లి పాంచజన్య గదిలో ప్రవేశించాం.

"ఆయన వెళ్లిపోయేక, నౌఖరు కాబోలు ఆ కోటు తీసికొచ్చి ఇక్కడ స్టాండుమీద పడేసుంటాడు" అంటూ

మూలవున్న స్టాండుమీది బట్టలు చూడసాగాడు సూర్యనాథ్.

రెండు నిమిషాలు ఆ పాత బట్టలు పరిశీలించి, "ఇదిగో ఈ బ్రౌన్ కలర్ కోటే, అప్పుడాయన విడిచింది" అంటూ స్టాండుమీంచి ఓ బ్రౌన్ కలర్ ట్వీడ్ కోటు తీసి నా కందించాడు.

గబగబ కోటు జేబులో వెదికేను. దాంతో ఆ రోజు పాంచజన్య ఎంత తొందరలో వున్నాడో అర్థమయింది. కారణం, కోటు జేబులో అవసరమయిన వస్తువులన్నీ అలాగేవున్నాయి.

దువ్వెనా, చేతిరుమాలూ, జలుబు నివారణకువాడే విక్స్ వేపొరబ్ బిళ్లలూ, చిన్న పాకెట్ డైరీ.

డైరీ అందుకుని నింపాదిగా పేజీలు తిరగెయ్యసాగేను. జనవరినించీ ఆగస్టువరకూ చెప్పుకోతగ్గ విశేషాలు లేవు. ఆగస్టు నెల రెండో తేదీన రాసుకున్న విషయాలు నన్నాకర్షించాయి. ఆ తేదీన యిలా రాసుకున్నాడు.

'ఆమె పరిచయమైన క్షణం నిజంగా మరువలేనిది. కళ్ళు చెదరగొట్టే అందం! అటువంటి అపురూప సౌందర్యవతి పరిచయమైన ఈ రోజు నా జీవితంలో చిరస్మరణీయం!

ఇంటికి వచ్చి యింతసేపైనా, ఆమె స్మృతులు నన్ను విడిచిపెట్టడం లేదు. కళ్ళు మూసినా తెరచినా ఆ రత్నాలరాసే కళ్ళల్లో మెదులుతోంది. ఆమెను పొందని జన్మ వ్యర్థమే అనిపిస్తోంది.

ఆగస్టు-3. ఉదయం వూహించనివిధంగా ఆమె ఫోన్ చేసింది సాయంత్రం సిద్ధార్థ హోటల్లో కలుసుకోమని.

ఆనందం పట్టలేకపోయాను. రెండోసారి ఆమె నెలా కలుసుకోవాలా అని మథనపడుతున్న నాకు ఈ విధంగా పరిష్కారం లభించింది.

ఆమె యిచ్చిన సైంటు హోటల్ చేరాను. తొలి పరిచయంతోనే నేను తనని చాలా ప్రభావితుడ్ని చేశానట! ఆ కామెంట్ నాలో రవంత గర్వాన్ని కలిగించక పోలేదు.

ఆ తరవాత వరసగా నెల రోజులు. అంటే ఆగస్టు చివరివరకూ ఆ అమ్మాయిని వివిధ ప్రదేశాల్లో కలుసుకున్న వైనాలు రాసుకున్నాడు పాంచజన్య.

ఐతే ఆ కలయికల్లో ఎక్కడా ఆమెని తను అనుభవించినట్టుగానీ, తమ పరిచయం స్నేహపుటద్దులు దాటినట్టుగానీ ఉదహరించలేదు. దీన్నిబట్టి ఆమె అందని ఆపిల్ పండులా అతనికి అంటీ అంటకుండా ఉవ్విళ్ళూరిస్తూ ఇన్నాళ్లూ గడిపిందని స్పష్టమౌతోంది.

ఆ తరవాత, అంటే పాంచజన్య మాయమవడానికి మూడు రోజుల ముందు అతను రాసుకున్న విషయాలు నా ఆసక్తికి హేతువయ్యాయి.

సాయంత్రం ఆరుగంటలకు మెరీనాబీచ్‌లో జె.ఆర్.ను కలుసుకోవాలి. "మిస్టర్ సూర్యనాథ్! ఈ జె. ఆర్. ఎవరు? మీ అన్నయ్య స్నేహితుల్లో ఈ అక్షరాలతో ప్రారంభమయ్యే పేర్లు గలవాళ్లెవరయినా వున్నారా?"

సూర్యనాథ్ కాసేపు ఆలోచించి, "నాకు తెలిసినంత వరకూ లేరు!" అన్నాడు.

"ఇక్కడ గమనించవలసిన మరో విషయం ఏమిటంటే, ఇంతవరకూ ఆయన డైరీలో ఆ అమ్మాయి పేరు రాయలేదు. ఆమె గురించి ప్రస్తావించినప్పుడల్లా 'ఆమె'

అని మాత్రం సంబోధించేవాడు. ఈ జె. ఆర్. ఆమె పార్ట్‌ఫాం కాదుగదా?"

"చెప్పలేను. మగవాడి పేరు కూడా కావచ్చు!"

సాలోచనగా తలూపుతూ తరవాతి పేజీ తిరగేశాను.

'ఉదయం పన్నెండు గంటలకు హోటల్ సిద్దార్థలో జానకిరామ్‌ను కలుసుకోవాలి.'

ఆ తరవాతి పేజీలో ఇలా రాసుంది-'మధ్యాహ్నం మూడు గంటలకు నంబర్ 146, ఎమ్. జి. రోడ్‌లో జె. ఆర్. ను కలుసుకోవాలి. ఈ రోజు తప్పకుండా ముట్ట జెపుతానని వాళ్ళకు మాటిచ్చాను."

అది అతను డబ్బుతో అదృశ్యమైన రోజు.

ఆ తరవాత డైరీ ఖాళీ!

ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు పాంచజన్య ఇంటికి వచ్చి, తమ్ముడితో భోంచేసి వెళ్ళాడు. మళ్ళీ తిరిగి రాలేదు.

సూర్యనాథ్ వైపు తిరిగి "మీ అన్నయ్య అడపా దడపా జానకిరామ్ అనే వ్యక్తిని హోటల్ సిద్దార్థలో కలుసుకునేవాడు. అదృశ్యమైన రోజున ఆయన మీతో లంచ్ తీసుకున్నాక, 146-ఎమ్. జి. రోడ్‌లో జె. ఆర్. అనే వ్యక్తిని కలుసుకోడానికి కళ్ళాడు.

కొంపదీసి ఆ జె. ఆర్. జానకిరామే కాదుకదా? సిద్దార్థ హోటల్‌కు ఫోన్ చేసి ఆ జానకిరామ్ అక్కడున్నాడో లేడో కనుక్కోవాలి" అంటూ ఫోన్ వైపు నడిచి, హోటల్ సిద్దార్థకు రింగ్ చేశాను.

"ఎస్!" అంది అవతలి ఆపరేటర్.

"కౌంటర్ ప్లీజ్!" అన్నాను.

ఆమె కౌంటర్‌కు లైన్ కలపగానే, "మీ హోటల్లో

జానకిరామ్ అనే వ్యక్తి నివసిస్తున్నారని తెలిసింది. ఆయన రూం నంబర్ చెప్పండి'' అన్నాను.

అవతల రెండు నిముషాలు నిశ్శబ్దం! ''ఎస్! నివసించే వారు! కాని, గది ఖాళీచేసి వెళ్ళిపోయారు.''

''ఎప్పుడు?''

''రెండు రోజుల క్రితం!''

''వెళ్ళేటప్పుడు ఏదయినా అడ్రసు వదిలి వెళ్లారా?''

''లేదు.''

ఫోన్ పెట్టేసి డైరీ మళ్ళీ తెరిచేను.

''మిస్టర్ సూర్యనాథ్! ఎమ్. జి. రోడ్ అంటే, బహుశా మహాత్మా గాంధీ రోడ్ అయుంటుందను కుంటాను. అక్కడికెళ్ళి వాకబుజేస్తే ఏమైనా తెలుస్తుం దేమో! వస్తాను'' అంటూ తన దగ్గర సెలవు తీసుకుని జీప్ ఎక్కాను.

5

అరగంటలో మహాత్మాగాంధీరోడ్ చేరుకున్నాను.

ఆ రోడ్‌లో ఉన్న అరంతస్థుల బిల్డింగ్ నంబరే 146. ఆ బిల్డింగ్‌లో అనేక ఆఫీసులూ, కుటుంబాలూ అద్దె కుంటున్నాయి.

బిల్డింగ్ కింద మెట్ల దగ్గర, గోడకు వరుసగా ఆయా ఆఫీసుల లెటర్ బాక్స్‌లు బిగించి వున్నాయి.

అన్నిటికన్నా కింది వరసలోవున్న ఓ కొత్తబాక్స్ నన్నాకర్షించింది.

దానిమీద తెల్లని పెయింట్‌తో రాసివున్నాయి అక్ష రాలు.

జె. ఆర్. ప్రొడక్షన్స్,

థర్డ్ ఫ్లోర్,
ఫ్లాట్ నెంబర్ -5.

గబగబ మెట్లెక్కి మూడో అంతస్థు చేరుకున్నాను. ఫ్లాట్ నెంబర్ 5 తలుపుమూసుంది. గుమ్మం పక్కన 'జె. ఆర్. ప్రొడక్షన్స్' అనే ప్లేట్ వేలాడుతోంది, అది డోర్ లాక్ సిస్టమ్ తలుపు.

అడుగులో అడుగు వేసుకుంటూ తలుపుని సమీపించి, ముందు పిడితిప్పి తెరవడానికి ప్రయత్నించాను. లాక్ వేసినట్టుంది. తెరుచుకోలేదు. లేదా లోపల ఎవరయినా ఉండి వుంటారు.

రెండు మూడుసార్లు గట్టిగా తట్టిచూసేను. జవాబు లేదు. చెవి ఆనించి విన్నాను లోపల ఏమైనా చప్పుళ్లు వినిపిస్తాయేమోనని. సూదిపడితే వినిపించే నిశ్శబ్దం.

వివరాలు కనుక్కుందామని దానికెదురు గావున్న ఫ్లాట్ దగ్గరకెళ్ళి తలుపు తట్టాను.

ఓ ముసలావిడ తెరిచింది డోర్.

"క్షమించాలి. మీ కెదురుగావున్న ఆ జె. ఆర్. ప్రొడక్షన్ మేనేజర్ని కలుసుకోవాలి. ఆఫీసు లాక్ చేసినట్టుంది. ఈరోజు తెరవలేదా?" అడిగాను.

"అదెప్పుడూ మూసేవుంటుంది. ఎప్పుడో వొకసారి యెవ్వరో ఒకరువచ్చి కాసేపుండి పోతారు అంతే."

"వాళ్లనెప్పుడయినా చూశారా మీరు? ఎంతమంది వస్తారు?"

"మనుషుల్ని చూడలేదు.అప్పుడప్పుడూ ఆఫీస్ తెరిచి వుండగా చూశాను."

"చివరిసారి ఎప్పుడు తెరిచారు?"

"మూడురోజుల క్రితం."

ఆమెకు థాంక్స్ చెప్పి, మెట్లుదిగి కిందకి వచ్చాను. ఐదు నిముషాలు అక్కడే వుండి, సిగరెట్ కాల్చి, తిరిగి మెట్లగుండా పైకి చేరుకున్నాను.

నేనూహించినట్టే ఆ ముసలావిడ ఇంటితలుపు మూసి వుంది. ఆమె తలుపు మూసుకునేవరకూ వెయిట్ చెయ్యాలనే నేను కిందికెళ్ళింది.

అడుగులో అడుగు వేసుకుంటూ జె. ఆర్. ప్రొడక్షన్ ఆఫీసు దగ్గరికెళ్ళాను. జేబులోంచి మారుతాళం చెవుల గుత్తి తీసి, ఐదునిముషాల ప్రయాసతో తెరవగలిగాను లాక్.

ఒకసారి చుట్టూ కలయజూసి, తలుపు తోసేను. కిర్రుమంటూ తెరుచుకుంది.

లోపల మనిషిమాత్రుడు లేడు.

బహుశా ఇది ఆఫీసుగదయి వుంటుంది. ఓగోడవారగా కుర్చీ, దానిముందు బల్ల, దానికి మూడువేపులా కుషన్ చేర్సు వేసున్నాయి.

బల్లమీద కేవలం కొన్ని పాత న్యూస్ పేపర్స్ పడి వున్నాయి. వాటితీరు చూస్తూంటే, అంతక్రితం బల్ల మీద కొన్ని ఫైళ్ళూ, ఇతర వస్తువులూ వుండివుంటాయని, ఈమధ్యే అవన్నీ ఆదరాబాదరా తీసి వేసుంటారనీ తోస్తోంది.

ఆగది ప్రక్కనే మరోగది వుంది. తలుపుమూసుంది. అటు నడిచేను. పిడితిప్పి మెల్లగా తలుపుతోసేను.అంతే.

దభీమంటూ నా మొహానికి ప్లాస్టిక్ సంచిలాటిదేదో గుద్దుకున్నట్టయింది. మరుక్షణం లిప్తపాటు నీలిరంగుకాంతి వెలిగి మాయమైంది. నా మొహమంతా ఏదో గ్యాస్ వ్యాపించినట్టు తోచింది.

అరక్షణం వెలిగిన ఆ కాంతిలోనే, నేనా వ్యక్తిని చూడగలిగాను. పొడుగ్గా, ఆరోగ్యంగా వున్నాడు. నల్ల రంగు సూటు వేసుకున్నాడు. అంతే...

ఆ గ్యాస్ ప్రభావంవల్ల నా మెదడులో మత్తు కమ్ముకోసాగింది. శరీరంలోని జవసత్వాలన్నీ ఉడిగి పోతున్నట్టూ, నీరసం ముంచుకు వచ్చినట్టూ కిందపడిపో సాగాను.

మరుక్షణం ఆ వ్యక్తి గబగబ బయటకు పరిగెత్తడం వరకే నాకు గుర్తుంది. ఆ తరవాత ఏం జరిగిందో నాకు తెలీదు.

6

మళ్ళీకళ్లు తెరిచిచూస్తే ఇంకా ఆ గదిలోనే పడు న్నాను. నిశ్శబ్దం రాజ్యమేలుతుంది లోపల.

ఆవ్యక్తి ఎవ్వరు? నాకతని మొహం ఇప్పటికీ బాగా స్పష్టంగా గుర్తుంది. అతిన్ని చూసింది అరక్షణమే ఐనా ఫోటో ప్రింటులా ఆ మొహం నా మస్తిష్కంలో ముద్ర వేసుకుంది.

ఇంతవరకూ అతన్నెక్కడా చూసినగుర్తు రాలేదు.

జేబులోంచి లైటరుతీసి వెలిగించాను. ఆ వెలుగులో రిస్టువాచీ చూసుకున్నాను. ఆరుగంటలు. నేనీ బిల్డింగులో ప్రవేశించినప్పుడు మధ్యాహ్నం రెండు గంటలవుతోంది. అంటే, నేను మూర్ఛపోయి నాలుగ్గంటలవుతోందా?

లేచి నిల్చుని కింద కలయజూసేను. గుమ్మందగ్గరగజం పొడవు పొలిథిన్ సంచిపడుంది. అందులోనే మూర్ఛ పోగొట్టే ఆ తీవ్రమైన గ్యాస్ నిండివుంటుంది. గదిలో యిప్పటికీ చిత్రమైన వాసన వేస్తోంది లీలగా.

నేను మొదటిసారి తలుపు తట్టినప్పుడే ఆ వ్యక్తి పని

గట్టి వుంటాడు. ఎవ్వరో అనుచితమైన వ్యక్తి వచ్చాడని డోర్ లాక్ చేసి వుండడంవల్ల నేను లోపల యెవ్వరూ లేరని పొరబడ్డాను. అతను లోపలినుంచి లాక్ చేసుకొని ఏదో చేస్తున్నాడు.

నేను రెండోసారి తలుపును సమీపించి మారుతాళం చెవులతో లాక్ తెరుస్తున్నప్పుడు అతనికి స్పష్టమయి పోయింది నేను పోలీసుకు సంబంధించిన వ్యక్తినై వుంటానని.

అందుకే మూర్ఛ పోగొట్టే గ్యాస్‌తో రెడీగా కాచుకున్నాడు. మొదటి గదిలోనే నన్ను మూర్ఛ పోగొడితే బయటివాళ్ళెవరయినా చూస్తారని, ఈ గదిలోకి వచ్చి తలుపేసుకుని ఎదురు చూడసాగాను.

నేను తలుపు తెరవగానే గ్యాస్ నిండిన పొలిథిన్ సంచి మొహానకొట్టి పారిపోయాడు. కొంపదీసి అతను జానకి రామ్ కాదుగదా? జె. ఆర్. ప్రొడక్షన్స్ అంటే జానకి రామ్ ప్రొడక్షన్స్ కాదుగదా?

ఆలోచిస్తూ గోడ తడిమి, ఎలక్ట్రిక్ స్విచ్ వత్తాను. గది మధ్య బల్బు వెలిగింది. ఆ కాంతిలో నా కన్పించిన మొదటి వస్తువు ఓ మూలవున్న పెద్దసైజు చెక్క పెట్టె.

ఆ పెట్టెకు తాళం వేసుంది. చుట్టూ పరికించాను. ఆ పెట్టె తప్ప గదిలో యింకేమీ లేవు. అడుగులో అడుగు వేసుకుంటూ దాన్ని సమీపించాను. పెట్టెపైన రాసున్న అక్షరాలమీద నా చూపు నిలిచిపోయింది.

'మిస్టర్ దినేష్ చోప్రా,
బాంబే సెంట్రల్ రైల్వేస్టేషన్.'

అంటే, ఈ పెట్టి గైల్స్ లగేజ్ ద్వారా బొంబాయి లోని దినేష్ చోప్రా పేర పంపడానికి సిద్ధంజేసి వుందన్నమాట. బహుశ, దీంట్లో ఈ ఆఫీసు తాలూకు ఫైళ్ళూ, సామానూ ఉండివుంటాయి.

ఆ కాగితాలద్వారా ఈ కంపెనీ వివరాలు తెలుసుకో వచ్చు అనుకుంటూ జేబులోంచి తాళంచెవుల గుత్తి తీశాను. రెండు మూడు తాళంచెవులతో ప్రయత్నించేక, క్లిక్ మంది తాళం!

దాన్ని ఊడదీసి, పెట్టి మూత పైకెత్తాను. అంతే! కరెంట్ షాక్ తగిలినట్లు నా చెయ్యి వెనక్కి వచ్చేసింది. పట్టు తప్పడంవల్ల పెద్ద చప్పుడుతో మూసుకుంది మూత!

నేననుకున్నట్టు పెట్టిలో ఫైల్లు లేవు
ఓ వ్యక్తి శవం వుంది!

రెండు నిమిషాల తరవాతగానీ నా గుండె దడ తగ్గ లేదు.

వణికే చేత్తో తిరిగి మూత పట్టుకుని పైకి లేపాను.

చెయ్యి ఓట్లుల కరెంట్ తగిలినట్టు ఒళ్లు ఝల్లుమంది.
అతను ఎవరో కాదు!

పాంచజన్య!!

ప్రాణంలేని పాంచజన్య!!!

శవం బాగా బిగుసుకుపోయినట్టుంది. బహుశా, హత్య జరిగి ఎన్నో గంటలు గడిచివుంటాయి. ఇప్పుడా శవాన్ని పెట్టిలో పెట్టి, తాళంవేసి, దినేష్ చోప్రా అనే బోగస్ పేరుమీద బొంబే పంపే ప్రయత్నం చేస్తున్నారన్న మాట. అంతలో నేను రావడం జరిగింది,

ఇప్పుడర్థమౌతోంది అసలు విషయం!

జె. ఆర్. ప్రొడక్షన్స్ పేరుతో ఈ ఆఫీసు తెరిచిన వాళ్ళు, పాంచజన్య పరిచయం సంపాదించి, తమ సంస్థ గురించి ఎలాగో అతన్ని పూర్తిగా నమ్మించి, బుట్టలో వేసుకుని, తమ సంస్థ కోసం ఐదు లక్షలు అప్పివ్వమనుంటారు.

వాళ్ళ బుట్టలో పడ్డ పాంచజన్య, బ్యాంకునించి, ఐదు లక్షలు డ్రాజేసి తెచ్చుంటాడు. డబ్బు చేతికందగానే, వాళ్ళతన్ని కైలాసం పంపేసి, శవాన్ని పెట్టెలో దాచేశారు.

ఇక్కడే ఓ మడత పేచీ వస్తోంది. అతన్ని చంపిన వాళ్ళు, శవాన్ని ఇక్కడే వదిలి ఎక్కడికైనా పారిపోవచ్చు కదా? అటువంటి అవకాశం వుండీ, కళేబరాన్ని పెట్టిలో పెట్టి ఎక్కడికో పార్సెల్ జేసే ప్రయాస దేనికి?

ఇక్కడే దాగుంది ఏదో మిస్టరీ!

హత్య ఎలా చెయ్యబడిందో తెలుసుకుందామని, శవాన్ని పరీక్షగా చూసేను. కుడి కణతలో కనిపించింది రంధ్రం! ఆ రంధ్రంగుండా కారి ఎండిపోయిన రక్తం!!

పిస్తోలుతో జరిగింది హత్య.

వెంటనే హెడ్క్వార్టర్స్‌కు ఫోన్ జెయ్యాలి. పెట్టె మూసి, గబగబ బైటికి నడిచేను. కిందికెళ్ళి, కొద్దిదూరంలో వున్న రెస్టారెంట్లోంచి ఫోన్ జేశాను. పది నిమిషాల్లో వచ్చేసింది అంబులెన్స్!

7

"ఎస్, ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి స్పీకింగ్!"

"హాలో ఇన్‌స్పెక్టర్! నేను, మణిభూషన్ని. ఉదయం

రెండుసార్లు మీ ఇంటికి ఫోన్ చేశాను. రెస్పాన్స్ లేదు. ఈ రోజు నా బర్త్‌డేపార్టీ వుంది. ఎన్ని పనులున్నా సరే, సాయంత్రం ఏడు గంటలకల్లా మా ఇంటికి వచ్చెయ్యాలి. తరవాత ఎటువంటి కుంటిసాకులు చెప్పినా నేను వినను!"

నగరంలోవున్న నా దగ్గరి ఫ్రెండ్సులో మణిభూషన్ ఒకడు. పెద్ద పారిశ్రామిక వేత్త. నిరాకరించడం సభ్యత కాదు. "మీరింతగా చెబుతున్నప్పుడు రాకుండా వుంటానా?" అన్నాను నవ్వుతూ.

"థాంక్స్!" అవతల క్లిక్ మంది.

ఏటేటా అతనికి తన పుట్టినరోజు ఘనంగా జరుపుకోడం అలవాటు. ఆ రోజు ప్రాణస్నేహితుల నించీ, మామూలు పరిచయస్థులవరకూ ఎందరినో ఆహ్వానిస్తాడు విందుకు.

రంగురంగుల దీపతోరణాలతో, మందీ మార్బలంతో రాత్రి రెండు గంటలవరకూ అట్టహాసంగా వుంటుంది ఇల్లు.

బట్టలు మార్చుకుని, సాయంత్రం సరిగ్గా ఏడుగంటలకు మణిభూషన్ భవనం చేరుకున్నాను.

కాంపౌండంతా రకరకాల వాహనాలతో నిండివుంది. వచ్చేపోయే స్త్రీ పురుషులతో సందడిగా వుంది. గుమ్మం దగ్గర నిల్చుని అందరికీ స్వాగతం పలుకుతున్నాడు మణిభూషన్.

అతని పక్కనే గులాబీరంగు చెక్కిళ్ళతో, బంగారు లతలా మెరిసిపోతున్న ఓ అందమైన యువతి నిల్చునుంది.

నన్ను చూడగానే మణిభూషన్ ముందుకు వచ్చి, సాదరంగా లోనికి ఆహ్వానించేడు. కేక్ కట్ జెయ్యడం పూర్తయ్యేక, ఆర్కెస్ట్రా మోగడం ప్రారంభమైంది. అతిథులకు విస్కీ సప్లై చేస్తున్నారు. ఆడా, మగా భేదం లేకుండా అందరూ పుచ్చుకుంటున్నారు.

అప్పుడు పరిచయం చేశాడు మణిభూషన్ నాకా అమ్మాయిని. "మీట్ హిమ్, మై ఫ్రెండ్ విశాలి! ఈయన మిస్టర్ రాజారెడ్డి"

ఆమె చిరునవ్వుతో నాకు షేక్‌హాండ్ ఇచ్చింది.

అంతలో ఆర్కెస్ట్రా స్థాయి తగ్గి, బాల్ డాన్స్ లయ ప్రారంభమైంది. అందరూ జంటజంటలుగా, నెమ్మదిగా అడుగులు వేస్తూ డాన్స్ ప్రారంభించేరు.

"నేను డిన్నర్ అరేంజ్‌మెంట్స్ చూసొస్తాను. అంతవరకూ మీరు డాన్స్ చేస్తూండండి!" అని అక్కణ్ణించి వెళ్ళిపోయేడు మణిభూషన్.

ఆమె చేతులందుకుని ఆర్కెస్ట్రా కనుగుణంగా అడుగులు వెయ్యసాగేను.

"మీరు పానీయం ఏదీ తీసుకోరా?" అడిగేను మాటలు కలుపుతూ.

"తీసుకున్నాను, గ్రేప్ జ్యూస్!"

"విస్కీ అలవాటు లేదా?"

ఆమె నవ్వి, తల అడ్డం తిప్పింది.

"పార్టీకి మీ రొక్కరే వచ్చారా?"

"నా వెంట మరొకతనున్నాడు!"

"నాతో మీరు డాన్స్ చెయ్యడం మీ స్నేహితుడి కభ్యంతరం వుండదు కదా?"

"అతను నా స్నేహితుడు కాదులెండి!"

"ఇదివరకు మిమ్మల్నెక్కడా చూసినట్టు జ్ఞాపకం లేదు. మణిభూషన్ స్నేహితులందరితో నాకు పరిచయం వుంది. మీ రిద్దరూ ఈ మధ్యే స్నేహితులై వుంటారను కుంటాను."

విశాలి నవ్వి తలూపింది!

"మీ స్వస్థలం ఇదేనా?"

విశాలి ఇబ్బందిగా మొహంపెట్టి, "నాకు రెండు రకాల మగవాళ్ళంటే ఇష్టం వుండదు. ఒకరు, నా వ్యక్తిగత వివరాలు తెలుసుకోగోరేవారూ, రెండో రకం నన్ను బలవంతంగా ప్రేమించాలనుకునే వారూ!"

"ఆ రెండు రకాల్లో నేను ఏ రకానికీ చెందకపోడం మీ అదృష్టం! ఏదో ఒకటి మాట్లాడాలన్న ఉద్దేశ్యంతో అలా అడిగేను కానీ, అందులో నాకట్టే ఇంట్రెస్టు లేదు!"

అంతటితో మా టాపిక్ మరోవైపు మళ్ళింది.

అంతలో ఓ బట్లర్ వచ్చి, "సర్! మిమ్మల్ని బాబు గారు పిల్చుకురమ్మన్నారు!" అన్నాడు.

"ఎక్కడున్నారాయన?"

"మేడమీద!"

"సారీ! ఇప్పుడే వస్తాను." అని విశాలి దగ్గర సెలవు తీసుకుని, నౌకరు వెంట మేడమీది కెళ్ళాను.

"ప్లీజ్ కమిన్ మిస్టర్ రెడ్డీ! నా ఫ్రెండ్సందర్నీ మీకు పరిచయం చేశాను గానీ, ఓ ముఖ్యమైన స్నేహితుణ్ణి పరిచయం చెయ్యడం మర్చాను. రండి!" అంటూ ఆహ్వానించేడు మణిభూషన్.

గదిలో అతనితోబాటు ఫుల్ సూటులోవున్న మరో వ్యక్తి కూర్చునున్నాడు.

"మీట్ హిమ్, మై డియరెస్ట్ ఫ్రెండ్ శ్రీకాంత్! ఈ మధ్యే మా ఆటోమొబైల్ కంపెనీలో షేర్ హోల్డర్ గా చేరారు...హి ఈజ్ రాజారెడ్డి" అంటూ మమ్మల్ని పరిచయం చేశాడు మణిభూషన్.

ఆ వ్యక్తిలేచి, "గ్లాడ్ టు మీట్ యూ ఇన్ స్పెక్టర్!" అంటూ షేక్ హాండ్ అందించేడు.

అతని చెయ్యి నా చేతిలోకి రాగానే ఒక్కలాగు లాగేను కిందికి. ఆ ఊపు కతని బాలెన్స్ తప్పి తూలేడు. అంతే! పిడికిలి బిగించి ఫిడేల్ మని ఇచ్చేను దవడకింద!

గజం ఎత్తు ఎగిరి అమాంతం నేలకూలేడు. బూటు మడమతో ఈడ్చి తన్నేను చెవిమీద. అతని తల పక్కకి వాలిపోయింది. మరో పది నిమిషాలదాకా మళ్ళీ స్పృహరాదు. ఇదంతా జరగడానికి ఒకేఒక్క నిమిషం పట్టింది!

8

"ఏమిటి ఇన్ స్పెక్టర్? ఏమిటిదంతా?" అన్నాడు మణిభూషన్ ఖంగారుగా!

"మిస్టర్ భూషన్! ఏదైతే నేను చెయ్యాలో అదే

చేశాను. ఇతని పేరు శ్రీకాంత్ కాదు! జె. ఆర్! పాంచ జన్యను హత్యచేసిన హంతకుడు!!!"

"క్షమించండి! నేను హంతకుణ్ణికాను!" అన్న కంఠం విని ఇద్దరం ఉలిక్కిపడి పక్కకి చూశాం.

అతనికి స్పృహ వచ్చేసింది! కన్ను మూసి తెరిచే లోగా జేబులోంచి పిస్తోలు తీసి అతనివైపు గురిపెట్టాను.

"మిస్టర్ జె. ఆర్! బుద్ధిగా లేచి నిల్చో! ఏ మాత్రం పిచ్చివేషాలు వేసినా, ఈ పిస్తోలు పొగలు కక్కుతుంది జాగ్రత్త!" అన్నాను కఠినంగా.

"పిచ్చి వేషాలు వేసే అవసరం నాకులేదు ఇన్‌స్పెక్టర్! ఎందుకంటే నేను జె. ఆర్.ని కాను! పాంచజన్యను చంపింది నేను కాదు!" అంటూ లేచి నిల్చున్నాడతను.

"బుకాయించక! నిన్న మధ్యాహ్నం మహాత్మాగాంధీ రోడ్లోని జె. ఆర్. ప్రొడక్షన్స్ ఆఫీసులో నన్ను మూర్ఛ పోగొట్టి పారిపోయింది నువ్వు కాదూ?"

"నేనే!"

"అక్కడ ఓ పెట్టెలో పాంచజన్య శవం దాచిపెట్ట లేదూ?"

"నిజమే!"

"నీ పేరు జానకిరామ్ కాదూ?"

"నిజమే! ఐనా, నేను పాంచజన్యను చంపలేదు!"

"ఐతే ఎవరు చంపేరు?"

"జె. ఆర్!"

"ఆ జె. ఆర్. నువ్వే కదా?"

"ఇక్కడే మీరు పొరబడ్డారు ఇన్‌స్పెక్టర్! జె.ఆర్. అంటే జానకిరామ్ అనుకుంటున్నారు మీరు. జె. ఆర్.

మగాడు కాదు. ఆడది! జె. ఆర్. ఫుల్ ఫామ్ జ్యోతి రాణి!!"

"నీ కల్లిబొల్లి కబుర్లు నమ్మడానికి నన్ను పసివాణ్ణను కుంటున్నావా?"

"నా మాట నమ్మండి! ఆ జ్యోతిరాణి ఇప్పుడు ఇక్కడే వుంది!"

"ఎక్కడ?"

"కింద, పార్టీలో!"

"పార్టీలోనా? ఎవ్వరు?"

"విశాలి!"

"విశాలి హత్య చేసిందా?" అన్నాడు మణిభూషన్ నివ్వెరబోయి.

"మిస్టర్ భూషన్! వెంటనే మీరు కిందికెళ్ళి ఆ విశాలికి అనుమానం రానివ్వకుండా పైకి తీసుకురండి!" అన్నాను.

మణిభూషన్ తలూపి, కిందికెళ్ళాడు.

పిస్తోలుతో జానకిరాంను కవర్ చేస్తూ అక్కడే నిల్చున్నాను.

ఐదు నిమిషాల తరవాత విశాలి, ఉరఫ్ జ్యోతిరాణితో పైకి వచ్చాడు మణిభూషన్. గదిలో అడుగుపెట్టగానే లోపలి దృశ్యం చూసి పారిపోవడానికి చటుక్కున వెనుదిరిగింది.

"మిస్టర్ మణీ! ఆమెను పట్టి తొయ్యండి లోపలికి!" అరిచేను. మణిభూషన్ ఆమె ప్రయత్నాలు వమ్ముచేసి, ఒక్క తోపు తోశాడు గదిలోకి.

వాళ్ళిద్దర్నీ పిస్తోలు రేంజ్ లోకి తీసుకుని—"ఇప్పుడు చెప్పండి! పాంచజన్యను ఎవరు చంపారో?" అన్నాను కటువుగా.

"నా మాట నమ్మండి ఇన్‌స్పెక్టర్! ఆ పథకం తయారుచేసింది ఈమే! నేను కేవలం ఈమె చేతిలో కీలుబొమ్మను...డబ్బు చేజిక్కగానే, అతన్ని బంధించి, ఎటైనా పారిపోదామని నేను సలహా ఇచ్చినా, ఈమె వినలేదు.

తనకిప్పుడప్పుడే మద్రాసు వదలాలని లేదనీ, మమ్మల్ని గుర్తుపట్టకుండా పాంచజన్యను చంపి, పెట్టెలో బాంబే పార్సిల్ జేసి, తరవాత మణిభూషన్‌ను వల్లో వేసుకుని, అతని కంపెనీలో షేర్ హోల్డర్స్‌గా జేరి, పాంచజన్యకు పట్టించిన గతే అతనికీ పట్టించాలని పథకం వేసింది..." గడగడ చెప్పుకుపోతున్నాడు జానకిరామ్.

పళ్ళు పటపట కొరుకుతూ, నిప్పులు కక్కుతూ అతని వైపు చూసింది జ్యోతిరాణి.

"నీచుడా! నాకే ద్రోహం తలపెడతావా? నీ బండారం బద్దలు కొట్టకుండా నే నూరుకుంటానా? ఇన్‌స్పెక్టర్! వీడు జానకిరామ్ కాడు! జగన్!! జైలునుంచి విడుదలై రెండు హత్యలు చేసిన జగన్!!

ప్లాస్టిక్ సర్జరీతో ముహం మార్చుకుని, జానకిరామ్‌లా వ్యవహరిస్తున్నాడు. నేను ఒక్క హత్యజేస్తే, వీడు రెండు హత్యలు చేసిన హంతకుడు!" అంది నిప్పులు కక్కుతూ.

దిగ్భ్రాంతివల్ల తెరుచుకున్న నా నోరు అలాగే వుండిపోయింది కాసేపు. తరవాత తేరుకుని, పిస్తోలు మణిభూషన్‌కిచ్చి, వాళ్ళిద్దర్నీ కవర్ జేస్తుండమని చెప్పి, జానకిరాం వెనక్కి వెళ్ళాను.

అతని రెండు దవడలకింద చేతులు పోనిచ్చి, మొహానికున్న మాస్క్‌ను పీకేశాను. జ్యోతిరాణి చెప్పింది నిజమే! వాడు జగన్!!

"హెడ్‌క్వార్టర్స్‌కు తీసికెళ్ళి నిన్ను చిత్రహింసలు పెట్టకముందే, ఈ నాటకమంతా ఏమిటో వివరంగా చెప్పు!" అన్నాను జగన్ డొక్కలో కుమ్ముతూ.

రెండు నిమిషాలవరకూ వాడి నోటినుంచి మాట పెగల్లేదు. తరవాత తేరుకుని చెప్పసాగేడు.

"నేను జైల్లోంచి విడుదలై బైటికి రాగానే, నన్ను కలుసుకుంది జ్యోతిరాణి. టాక్సీ ఎక్కించుకుని కినారా హోటల్‌కు తీసికెళ్ళింది.

నాలాగే తనూ దొంగతనమే వృత్తిగా జీవిస్తున్నాననీ, బొంబేనించి ఈ మధ్యే మద్రాసు వచ్చాననీ, తన అందచందాలతోనూ, పథకాలతోనూ ఇక్కడి పెద్దమనుషుల్ని వల్లోవేసుకుని డబ్బు చేసుకోవాలనుకుంటున్నాననీ ఆ వ్యవహారంలో తనకు సహాయం కావాలనీ చెప్పింది.

జైల్లోంచి విడుదలై ఏంచేద్దామా అనుకుంటున్న నాకు ఆమె ప్రస్తావన కొండంత బలాన్నిచ్చింది. వెంటనే ఒప్పుకున్నాను. తన ప్లాన్ ఏమిటో పూసగుచ్చినట్లు వివరించింది నాకు.

దాని ప్రకారం, మహాత్మాగాంధి రోడ్‌లోని ఆ బిల్డింగ్‌లో జె. ఆర్. ప్రొడక్షన్స్ పేరుతో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకున్నాం. స్వయంగా తనే ప్లాస్టిక్ సర్జరీ ద్వారా నా మొహం పూర్తిగా మార్చివేసింది.

అంతకుముందే ఎలాగో పాంచజన్యతో పరిచయం సంపాదించుకుంది. స్త్రీ లోలుడైన అతను ఆమె అందానికి పూర్తిగా దాసుడైపోయాడు. ఆ తరువాత మారు వేషంలో వున్న నన్ను, ప్రఖ్యాత హిందీ డైరెక్టర్ రాజారామ్‌గా అతనికి పరిచయం చేసింది.

వాళ్తో కలిసి తాను గొప్ప బడ్జెట్ చిత్రం తియ్య బోతున్నాననీ, ఐదు లక్షలు తక్కువయ్యాయనీ, ఫైనాన్స్ చెయ్యమనీ ప్రాధేయపడింది. ఆమె మాయలో పడ్డ అతను ఆ కాకమ్మ కథను పూర్తిగా నమ్మేడు. వడ్డీ లేకుండా అప్పిస్తానని మాటిచ్చేడు.

ఇప్పుడు ప్లాస్టిక్ సర్జరీతో నా మొహం పూర్తిగా మారిపోయింది గనక, ఏవాళ్ళనించో నాలో రగులు తున్న నారాయణా, సుకన్యలమీది పాతపగ తీర్చుకోవా లని నిశ్చయించేను. అందుకు జ్యోతిరాణి ఒప్పుకోకున్నా నేను వినలేదు. వాళ్ళని చంపేశాను...

ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు బ్యాంకు నించి డబ్బు తీసుకుని, జె. ఆర్. ప్రొడక్షన్స్ ఆఫీసుకు వచ్చేడు పాంచజన్య. బ్రీఫ్ కేస్ చేతికి రాగానే అతన్ని రెండు రోజులు అక్కడే బంధించి, తర్వాత కాల్చి చంపేసింది జ్యోతిరాణి. ఆ తరవాత మణిభూషన్ కు గాలం వేసింది..." అంటూ తల వంచుకున్నాడు జగన్.

నేను పలకలేదు. హెడ్ క్వార్టర్స్ కు ఫోన్ చెయ్య డానికి ఫోన్ వైపు అడుగులు వేశాను. మణిభూషన్ పిస్తోలుతో వాళ్ళని కవర్ జేస్తూ నిల్చున్నాడు.

—: అయిపోయింది :—